క్లుప్తంగా...

వైద్యులను సన్మానించిన నాయకులు



వైద్యులను సన్మానిస్తున్న నాయకులు

శామీర్‌పేట్: వైద్య దినోత్సవం సందర్భంగా శామీర్‌పేటలోని పీహెచ్‌సీ వైద్యులను నాయకులు సన్మానించారు. బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు అఫ్జల్‌ఖాన్ ఆధ్వర్యంలో శామీర్‌పేట ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో విధులు నిర్వహిస్తున్న వైద్యులను సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్‌రెడ్డి, మహ్మద్‌గౌస్, వెంకట్, నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



మేడ్చల్: పట్టణంలోని 23వ వార్డులో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని వార్డు కౌన్సిలర్ కాడే మహేష్ ప్రారంభించారు. సీఎంఆర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని ప్రారంభించి మందులు అందజేశారు. సీఎంఆర్ ఆసుపత్రి వైద్యులు శిబిరానికి హాజరైన వారికి వివిధ రకాల పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు.

నాయకత్వ లక్షణాలు అలవరచుకోవాలి



ప్రమాణ స్వీకారం చేస్తున్న హెడ్‌బాయ్, హెడ్ గర్ల్

ఘట్‌కేసర్: మాజీ రాష్ట్రపతి దివంగత అబ్దుల్ కలాంలాగ విద్యార్థి దశలోనే నాయకత్వ లక్షణాలు అలవరుచుకోవాలని రోటర్‌డ్యామ్ ప్రిన్సిపల్ రూపారెడ్డి అన్నారు. చౌదరిగూడ రోటర్‌డ్యామ్ ఇంటర్నేషనల్ స్కూల్లో శనివారం ఎన్నికైన హెడ్ బాయ్, హెడ్ గర్ల్, కౌన్సిల్ సభ్యులకు డైరెక్టర్ శ్వేతారెడ్డితో కలిసి బ్యాడ్జ్ అందజేసి ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం విద్యార్థుల మార్చ్‌ఫాస్ట్, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

అభివృద్ధి పనులు పూర్తి చేయాలి



అవుషాపూర్ పాలకవర్గ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్: పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు పూర్తి చేయాలని ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి కోరారు. శనివారం అవుషాపూర్ పంచాయతీ కార్యలయంలో సర్పంచ్ కావేరిమశ్చేందర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన పాలకవర్గ సమావేశానికి ఎంపీపీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అందుబాటులో ఉన్న నిధులు, గ్రామాభివృద్ధిపై చర్చించారు. సమావేశంలో ఉప సర్పంచ్ ఐలయ్యయాదవ్, వార్డు సభ్యులు రాధా, సంధ్య, పద్మ, అరుణ, దివ్య, మల్లేశ్, వీరేశ్, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

దర్గాలో ఉర్సు ఉత్సవాలు



మేడ్చల్: పట్టణంలోని బడా కబ్రస్థాన్ వద్ద గల హజ్రత్ షోఫి సయ్యద్ హైమద్ షా ఖాద్రి ఖిస్త్రి దర్గాలో ఉర్సు ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. దర్గా వద్ద ముస్లింలు ప్రత్యేకంగా ప్రార్థనలు నిర్వహించారు. చద్దర్ సమర్పించారు. సంప్రదాయం వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కాడే మహేష్ కోఆప్షన్ సభ్యులు మహబూబ్‌అలీ పాల్గొన్నారు.

ఎంపీఓను కలిసిన సర్పంచులు



కీసర: కీసర మండల ఎంపీఓగా కొత్తగా బాధ్యతలు స్వీకరించిన వినూత్నరెడ్డిని వివిధ గ్రామాల సర్పంచులు కలిశారు. ఈమేరకు శనివారం కీసర మండలపరిషత్ కార్యాలయానికి వచ్చిన సర్పంచులు ఎంపీఓ వినూత్నరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. సర్పంచులు ఆకిటిమహేందర్‌రెడ్డి, సత్తెమ్మ, గోపాల్‌రెడ్డి, పెంటయ్య, అండాలు మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గ్రూప్‌-4 పరీక్ష



వీబీఐటీ పరీక్ష కేంద్రం వద్ద పర్యవేక్షిస్తున్న సీఐ మహేందర్‌రెడ్డి



సీఎంఆర్ ఇంజనీరింగ్ కళాశాల పరీక్షా కేంద్రంలోకి వెళ్తున్న అభ్యర్థులు



పరీక్షా కేంద్రం వద్ద తమ హాల్ టికెట్ చెక్ చూసుకుంటున్న అభ్యర్థులు

మేడ్చల్ రూరల్: మేడ్చల్‌లో గ్రూప్‌-4 పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో 13 పరీక్షా కేంద్రాలను కేటాయించగా మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని మల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలతో పాటు జూనియర్ కళాశాలలో, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో కేంద్రాలను ఏర్పాటు చేశారు.అభ్యర్థులను ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వసతులు కల్పించారు. సెంటర్ సిబ్బంది అభ్యర్థులను క్షుణ్ణంగా పరిశీలించి లోపలికి అనుమతించారు. మేడ్చల్ ఏసీపీ వెంకట్‌రెడ్డి, సీఐ రాజశేఖర్‌రెడ్డి, సిబ్బందితో కలిసి బందోబస్తు నిర్వహించారు. చివరి నిమిషాల్లో పరీక్షా కేంద్రం కోసం వెతుకుతున్న పలువురు అభ్యర్థులను మేడ్చల్ సీఐ రాజశేఖర్‌రెడ్డి తన వాహనంలో కేంద్రాల వద్దకు పంపి పరీక్షా రాసే వీలు కల్పించారు.

పరీక్ష రాయలేకపోయిన మహిళా అభ్యర్థి

పరీక్షా కేంద్రానికి గంటన్నర సమయం ముందు వచ్చినా తాను చేసిన చిన్న తప్పదంతో ఓ మహిళా అభ్యర్థి గ్రూప్‌-4 పరీక్ష రాయలేకపోయింది. శామీర్‌పేట్ మండలానికి చెందిన సమ్రిన్ కండ్లకోయలోని సీఎంఆర్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో పరీక్ష రాయడానికి గంటన్నర ముందే వచ్చింది. పరీక్షా కేంద్రంలోకి అభ్యర్థులను అనుమతించే సమయంలో సమ్రిన్‌ను సెంటర్ సిబ్బంది పరిశీలించగా హాల్‌టికెట్‌తో పాటు ఆధార్ ఒరిజినల్ లేకపోవడంతో లోపలికి అనుమతించలేదు. ఐడీ ప్రూఫ్‌గా ఏ ఒక్కటి ఒరిజినల్ కార్డు లేకపోవడంతో సిబ్బంది అనుమతి నిరాకరించారు. ఆమె సోదరుడు తన ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్లి ఆధార్ ఒరిజినల్ ధృవపత్రాన్ని తీసుకురాగా అప్పటికే పరీక్షా కేంద్రంలోకి అభ్యర్థులను అనుమతించాల్సిన సమయం పూర్తి కావడంతో వెనక్కి పంపారు.దీంతో ఆమె కన్నీటితో వెనుతిరిగింది.

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ మండలంలో 15 కేంద్రాల్లో శనివారం నిర్వహించిన గ్రూపు-4 పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. కేంద్రాల్లోకి వెళ్లే వారిని పరీక్ష నిర్వాహకులు క్షుణ్ణంగా తనిఖీ చేసి లోపలికి పంపించారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ మహేందర్‌రెడ్డి గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. మండలంలో ఏర్పాటు పరీక్ష కేంద్రాల్లో మొత్తం 10,920 మంది అభ్యర్థులను కేటాయించారు.

కీసరలో..

కీసర: కీసర మండలంలోని వివిధ పరీక్ష కేంద్రాల్లో శనివారం నిర్వహించిన గ్రూప్‌-4 పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం నుండి సాయంత్రం వరకు కీసర సీఐ వెంకటయ్య ఆధ్వర్యంలో పరీక్షకేంద్రాల వద్ద గట్టిపోలీస్‌బందోబస్తు ఏర్పాటుచేసారు. కీసర మండలరెవెన్యూపరిధిలోని 17 సెంటర్లలో అభ్యర్థులు గ్రూప్‌-4 పరీక్షలకు హజరయ్యారు.



66,638 మంది హాజరు

సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్‌-మల్కాజిగిరి జిల్లాలో టీఎస్‌పీఎస్‌సీ అధ్వర్యంలో శనివారం నిర్వహించిన గ్రూపు-4 పరీక్ష నిర్వహణకు 187 కేంద్రాలను ఏర్పాటు చేయగా 90,220 మంది అభ్యర్థులకుగాను 66,638 మంది అభ్యర్థులు హాజరైనట్లు జిల్లా అదనపు కలెక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి తెలిపారు. ప్రతి పరీక్ష కేంద్రానికి జిల్లా అధికార యంత్రాంగం ఒక లైజన్ అధికారిని నియమించినట్లు పేర్కొన్నారు. జిల్లాలో గ్రూపు-4 పరీక్షలు సజావుగా, ప్రశాంతంగా జరిగినట్లు తెలిపారు. ఘట్కేసర్ మండలంలోని అంకుషాపూర్ ఏసీఈ ఇంజనీరింగ్ కళాశాలలో ఒక అభ్యర్థి అదనపు గుర్తింపు పత్రం తీసుకురానందున పరీక్షకు అనుమతించలేదని ఆ కేంద్రం సీఎస్ తెలినట్లు అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. ఈ విషయంపై టీఎస్‌పీఎస్‌సీ అధికారులకు నివేదికను పంపనున్నట్లు తెలిపారు.

ప్రతి ఇంటికీ ఆరు మొక్కల పంపిణీ

కీసర: హరితహారంలో భాగంగా పంచాయతీ ఆధ్వర్యంలో ఇంటింటికీ 6 మొక్కల చొప్పున పంపిణీ చేయనున్నట్లు గోధుమకుంట గ్రామసర్పంచ్ ఆకిటి మహేందర్‌రెడ్డి అన్నారు. శనివారం గ్రామంలో ఇంటింటికీ 6 మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో గ్రామస్తులకు పంపిణీ చేస్తున్న మొక్కలను సంరక్షించుకోవాలని సూచించారు. కరీంగూడ గ్రామంలో సర్పంచ్ కౌకుట్ల గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో మొక్కల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. చీర్యాల గ్రామంలో సర్పంచ్ తుంగధర్మేందర్ పంపిణీ చేశారు. ఎంపీటీసీ సభ్యురాలు మంచాల కిరణ్ జ్యోతిప్రవీణ్, ఉపసర్పంచ్‌లు మాధవరెడ్డి, తిరుమల్‌రెడ్డి, ఆంజనేయులు పాల్గొన్నారు.



గోధుమకుంట గ్రామంలో మొక్కలను పంపిణీ చేస్తున్న గ్రామసర్పంచ్ మహేందర్‌రెడ్డి

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేసిన చైర్ పర్సన్



చెక్కును అందజేస్తున్న చైర్ పర్సన్ దీపికరెడ్డి

మేడ్చల్: ముఖ్యమంత్రి సహాయనిధి నుండి మంజూరైన ఆర్థిక సహాయం చెక్కును లబ్ధిదారుడికి మేడ్చల్ మున్సిపల్ చైర్ పర్సన్ దీపిక నర్సింహారెడ్డి కౌన్సిలర్ మర్రి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి మున్సిపల్ కార్యాలయంలో అందజేశారు. పట్టణంలోని 13వ వార్డుకు చెందిన వజ్రబాయికి వైద్యం కోసం రూ.25వేలు మంజూరు కావడంతో ఆ చెక్కును ఆమె అందజేశారు. కార్యక్రమంలో 4వ వార్డు కౌన్సిలర్ తుడుం గణేష్ పాల్గొన్నాడు.

సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమం

కీసర: మండలంలోని తిమ్మాయిపల్లి, అంకిరెడ్డిపల్లి గ్రామాల్లో శనివారం కీసర మండల వైద్యబృందం ఆధ్వర్యంలో గ్రామస్తులకు, పంచాయతీ సిబ్బందికి అత్యవసరసమయంలో సీపీఆర్ ఏవిధంగా చేయాల్లో డాక్టర్లు విజయ్‌ప్రతాప్, కృత్తిక ఆధ్వర్యంలో అవగహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచులు పెంటయ్య, విమల, ఏఎన్‌ఎం ఇందిరా, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, వార్డుసభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



అంకిరెడ్డిపల్లి గ్రామంలో సీపీఆర్‌పై అవగహన కల్పిస్తున్న వైద్యులు

తెలంగాణ జైళ్లశాఖ సంస్కరణలు భేష్

కుషాయిగూడ: ఖైదీల సంక్షేమానికి తెలంగాణ జైళ్లశాఖ చేపడుతున్న సంస్కరణలు భేష్ అని పంజాబ్ జైళ్లశాఖ డైరక్టర్ జనరల్ అరుణ్‌పాల్‌సింగ్ అన్నారు. శనివారం చర్లపల్లి కేంద్రకారాగారాన్ని ఆయన సందర్శించారు. జైల్‌లో ఖైదీల సంక్షేమానికి చేపడుతున్న కార్యక్రమాలను తెలుసుకున్నారు. జైల్‌లోని అన్నపూర్ణ, ఆసుపత్రి, బ్యారక్‌లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే జైల్ ఉత్పత్తులు, ఖైదీల ఉపాధి మార్గాలను తెలుసుకున్న ఆయన జైళ్లశాఖ అధికారులను అభినందించారు. తెలంగాణ జైళ్లశాఖ సంస్కరణలు ఆదర్శప్రాయం, ఆచరణీయమన్నారు. కార్యక్రమంలో జైళ్లశాఖ అధికారులు వై. రాజేష్, మురళీబాబు, సంతోష్‌కుమార్, కృష్ణమూర్తి, శశికాంత్, డాక్టర్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



ఖైదీల ఉత్పత్తులను పరిశీలిస్తున్న పంజాబ్ జైళ్లశాఖ డీజీ అరుణ్‌పాల్ సింగ్

బైక్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు.. వ్యక్తి మృతి



రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కిరణ్‌కుమార్

కుషాయిగూడ: అదుపుతప్పి ఆర్టీసీ బస్సు ఢీ కొట్టిన సంఘటనలో ఓ వ్యక్తి మృతిచెందాడు. శుక్రవారం రాత్రి చోటు చేసుకున్న ఈ సంఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన మేరకు.. సైనిక్‌పురి, అంబేద్కర్‌నగర్‌లో నివసించే కొడిమెల్ల కిరణ్‌కుమార్ (30) ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు.ఇతనికి భార్య అశ్విని, ఇద్దరు పిల్లలు ఉన్నారు. శుక్రవారం భార్యకు చెప్పి బైక్‌పై వెళ్లాడు. ఈ క్రమంలో సైనిక్‌పురి, ఈసీఐఎల్ రోడ్డులో వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన ఆర్టీసీ బస్సు అదుపు తప్పి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తలకు తీవ్ర గాయమైన కిరణ్‌కుమార్‌ను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా డాక్టర్లు మృతిచెందినట్లు తెలిపారు. ఆర్టీసీ డ్రైవరు అజాగ్రత్తగా బస్సు నడపడం వల్లే ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

జవహర్‌నగర్ అభివృద్ధికి అహర్నిశలు కృషి

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ 15వ డివిజన్ ఆనంద్‌నగర్ కాలనీలో జరుగుతున్న అభివృద్ధి పనులను శనివారం మేయర్ మేకల కావ్య అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జవహర్‌నగర్ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నామన్నారు. మంత్రి మల్లారెడ్డి సహకారంతో జవహర్‌నగర్ ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. కార్యక్రమంలో కమిషనర్ రామలింగం, నాయకులు మేకల అయ్యప్ప, నాగభూషణం, మతిన్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్‌కు పాలాభిషేకం



మేడ్చల్ లో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న రజకులు

మేడ్చల్: పట్టణంలో రజకులు ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి పాలతో అభిషేకం చేసి తమ కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం జీఓ 102 విడుదల చేయడంతో రజకులు హర్షం వ్యక్తం చేస్తూ అంబేడ్కర్ విగ్రహం వద్ద సీఎం కేసీఆర్ చిత్రపటం ఏర్పాటు చేసి పాలతో అభిషేకం చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో రజక సంఘం నాయకులు పాల్గొన్నారు.


ప్రతి ఇంట్లో హరితహారం మొక్కలను నాటాలి

శామీర్‌పేట్: ప్రతీ ఇంట్లో హరితహారం మొక్కలను నాటాలని మూడుచింతలపల్లి సర్పంచ్ జాం రవి అన్నారు. మూడుచింతలపల్లి గ్రామంలో శనివారం ఇంటింటికీ హరితహారం మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ... గ్రామంలోని ప్రతీ ఇంట్లో 6 మొక్కలను నాటి సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజేశ్వర్ రెడ్డి, ఎంపీటీసీ నాగరాజు పాల్గొన్నారు.

వైద్యుల సేవలు అభినందనీయం

జవహర్‌నగర్: అంతర్జాతీయ డాక్టర్స్ డే సందర్భంగా శనివారం కాంగ్రెస్ పార్టీ మహిళ కమిటీ ఆధ్వర్యంలో జవహర్‌నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని డాక్టర్లను, వైద్య సిబ్బందిని సత్కరించారు. ఈ సందర్భంగా మాజీ వార్డు సభ్యురాలు రజితగోపాల్ మాట్లాడుతూ.. సమాజంలో వైద్యుల పాత్ర కీలమని, వారి సేవలు ఎంతో అభినందనీయమన్నారు. కార్యక్రమంలో చింతల ధనమ్మ, లత, సరితసోనూ, సునీత, లక్ష్మీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. ఒకరు మృతి



మృతిచెందిన మద్దులేటి

మేడ్చల్ రూరల్: ప్రమాదవశాత్తు ఆటో బోల్తా పడి ఒకరు మృతిచెందిన ఘటన శనివారం మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది... వివరాలు.. కర్నూలు జిల్లా పెద్దమల్కాపురానికి చెందిన మద్దులేటి తో పాటు అతడి స్నేహితులు వంశీకృష్ణ, ఆచారి బ్రహ్మయ్యలు బండలు పరిచే పనిచేసేందుకు పటాన్‌చెరు మండలం, బీరంగూడకు వలస వచ్చి బోయ ఈశ్వర్ వద్ద పని చేస్తున్నారు. ఈ క్రమంలో శనివారం మేడ్చల్ మండలం, రావల్‌కోల్ గ్రామానికి పనికి ఆటోలో వస్తుండగా జయదర్శిని వద్ద వీరు ప్రయాణిస్తున్న ఆటో ప్రమాదవశాత్తు బోల్తా పడింది. దీంతో ఆటోలో ఉన్న మద్దులేటి అక్కడికక్కడే మృతిచెందగా, ముగ్గురికి స్వల్పగాయాలయ్యాయి. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి



డిగ్రీ పట్టాలు పొందిన ఉత్తమ విద్యార్థులతో మంత్రి మల్లారెడ్డి

మేడ్చల్‌రూరల్: విద్యార్థులు తమ వృత్తి జీవితంలో ఉన్నత స్థానాల్లో నిలవాలంటే సమయం విలువ తెలుసుకుని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి మల్లారెడ్డి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని మల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల మెయిన్ క్యాంపస్‌లో శనివారం 18వ గ్రాడ్యుయేషన్ డే పాల్గొన్న ఆయన విద్యార్థులకు డిగ్రీ పట్టాలు ప్రదానం చేశారు. ఉత్తమ విద్యార్థులను మెడల్స్‌తో సత్కరించారు. మంత్రి మాట్లాడుతూ నూతన సాంకేతిక నైపుణ్యాలను వినియోగించుకుని విద్యార్థులు మంచి గుర్తింపుతో ఉన్నత శిఖరాలకు చేరాలన్నారు. కార్యక్రమంలో సయంట్ సంస్థ, ఈ పామ్, సిలికాన్ ల్యాబ్స్, కాగ్నిజెంట్ సంస్థ ప్రతినిధులు విజయ్, ఇమాన్యూల్, సుబ్రమణియన్, జితేంద్ర సింగ్ లు విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు.

మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ...

మల్లారెడ్డి ఇంజనీరింగ్ కాలేజ్ స్టూడెంట్స్ అసోసియేషన్ కౌన్సిల్, సోషల్ సర్వీస్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి మల్లారెడ్డి పలువురు ఒంటరి మహిళలకు కుట్టు మిషన్లు ఉచితంగా అందజేశారు.

విశ్రాంత ఉద్యోగులకు వైద్యసౌకర్యం కల్పించాలి

ఘట్‌కేసర్: వెంకటాపూర్ నీలిమా ఆస్పత్రిలో సింగరేణి విశ్రాంత ఉద్యోగులకు వైద్యసౌకర్యం కల్పించాలని కోరుతూ నీలిమా ఆస్పత్రి నిర్వాహకులకు వినతిపత్రం అందజేశారు.అలాగే ఈ వినతిపత్రాన్ని సింగిరేణి చీఫ్ మెడికల్ ఆఫీసర్‌కు పోస్ట్ ద్వారా శనివారం వినతి పత్రం అందజేశారు. ఘట్‌కేసర్, ఉప్పల్ పరిసర ప్రాంతాల్లో సుమారు 500 మంది సింగరేణి ఉద్యోగులు సింగరేణి యాజమాన్యం ఇచ్చిన సీపీఆర్ ఎంఎస్ మెడికల్ కార్డును ఉపయోగించుకోవాలంటే హైదరాబాద్‌కు వెళ్లాల్సివస్తుందని లేఖలో పేర్కొన్నారు. కార్యక్రమంలో సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు వేణుమాధవ్, నాయకులు రాజయ్య, మల్లయ్య, నర్సయ్య, ప్రతాప్‌సింగ్, రఫీక్ పాల్గొన్నారు.



నీలిమా ఆస్పత్రిలో వినతి పత్రం అందజేస్తున్న వేణుగోమాధవ్, రాజయ్య తదితరుల

మేడిపల్లి మండల ప్రెస్ క్లబ్ నూతన కమిటీ ఎన్నిక



మేడిపల్లి: మేడిపల్లి మండల ప్రింట్ మీడియా(టీయూడబ్ల్యూజే-ఐజేయు) నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం మేడిపల్లి సంపూర్ణ హోటల్‌లో జరిగిన సీనియర్ పాత్రికేయుల సమావేశంలో ఈ నూతన కమిటీని ఎన్నుకున్నారు.అధ్యక్షులుగా లెల్లపాటి నర్సింహారెడ్డి, ఉపాధ్యక్షులుగా చిలుకూరి సుదర్శన్, ప్రధాన కార్యదర్శిగా ఉప్పలోజు రవిచంద్ర, కోశాధికారిగా ఆరికట్ల వెంకటేశ్వర్లు, గౌరవ అధ్యక్షులుగా సంకూరి మురళి, సలహాదారులుగా వెల్లెంకి జయపాల్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా సిలివేరు వేణు, గౌరవ కార్యవర్గ సభ్యులుగా దొంతుల రాజిరెడ్డి, జున్ను శ్రీనివాస్‌గౌడ్, వర్ధెల్లి రవీందర్‌గౌడ్ ఎన్నికయ్యారు.

విద్యార్థులకు నోట్ బుక్స్ అందజేత

శామీర్‌పేట్: పేద విద్యార్థులను ప్రోత్సహించేందుకు దాతలు ముందుకురావాలని సర్పంచ్ సుకన్య అన్నారు. ఉప్పరిపల్లి మాజీ సర్పంచ్ కట్టెల రవీందర్ సహకారంతో శనివారం శామీర్‌పేట మండలం, పొన్నాల్ గ్రామ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచితంగా నోట్‌బుక్స్‌తో పాటు స్టేషనరీని అందజేశారు. కార్యక్రమంలో దాత దినేష్, ఎంపీటీసీ మౌనిక, ప్రధానోపాధ్యాయులు సంజీవ, ఎస్‌ఎంసీ చైర్మన్ లక్ష్మయ్య, వార్డుసభ్యులు ప్రభాకర్, శివవీర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



నోట్‌బుక్స్‌తో పొన్నాల్ పాఠశాల విద్యార్థులు

9 ఏళ్లలో అనేక సంక్షేమ పథకాలు



దమ్మాయిగూడలో ఇంటింటికి బీజేపీ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

కీసర: ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో గత 9 ఏళ్ల కాలంలోఅనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు కొంపల్లిమోహన్‌రెడ్డి అన్నారు. అందుకే అభివృద్ధి పథకాలను తెలియజేసేందుకు బీజేపీ ఆధ్వర్యంలో జనసంపర్క్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. శనివారం చీర్యాల గ్రామంలో నిర్వహించిన జనసంపర్క్ అభియాన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జిల్లాల తిరుమల్‌రెడ్డి, నేతలు కోల బాల్‌రాజ్, నాగేష్, బోడ శ్రీనివాస్‌రావు, పాల్గొన్నారు. దమ్మాయిగూడ మున్సిపాలిటీలో నిర్వహించిన కార్యక్రమంలో తమిళనాడునుండి వచ్చిన విస్తారక్ నందిని ఇంటింటికి బీజేపీ విజయాలను తెలియజేసే కరపత్రాల పంపిణీ చేశారు.

ప్రగతి పథం వైపు పయనించాలి



డేటా సైన్స్ అవగాహన సదస్సులో పాల్గొన్న హెచ్ఓడీ మల్లికార్జున్

ఘట్‌కేసర్: యువత వ్యక్తిగత నైపుణ్యం పెంపొందించుకొని ప్రగతి పథం వైపు పయనించాలని అనురాగ్ యూనివర్సిటీ(ఏయూ) హెచ్ఓడీ డాక్టర్ మల్లికార్జున్ అన్నారు. శనివారం వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో డేటా సైన్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డేటా సైన్స్‌లో పైతాన్ ప్రోగ్రామింగ్ భాషలో ఎలా ఉపయోగించాలో వివరించి, ఏ2ఐ అనుసంధానంతో కృత్రిమ విభాగం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ సంచాలకులు విక్టర్ డేనియల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గంజాయి విక్రేత అరెస్ట్

పోచారం: వాహనాలను తనిఖీ చేస్తుండగా ఎక్సైజ్ పోలీసులకు గంజాయి విక్రేత చిక్కాడు. ఘట్‌కేసర్ ఎక్సైజ్ స్టేషన్ సీఐ మల్లయ్య తెలిపిన మేరకు.. శనివారం ఘట్‌కేసర్ వై జంక్షన్ వద్ద అనుమానిత వాహనాలను తనిఖీ చేస్తుండగా యాక్టివా ద్విచక్ర వాహనంపై ఓ వ్యక్తి వరంగల్ నుండి వస్తూ రాంపల్లి వైపు మళ్లాడు. అతన్ని ఆపి తనిఖీ చేయగా సంచిలో 2.3 కిలోల ఎండు గంజాయి లభించింది. ముద్దాయి కాప్రాలోని చంద్రగిరి కాలనీకి చెందిన బి.డేవిడ్ (20)గా గుర్తించారు. అరకు నుండి గంజాయిని తక్కువ ధరకు తెచ్చి జవహర్‌నగర్‌లోని కాలేజ్ విద్యార్థులకు, గంజాయి వ్యసనపరులకు ఎక్కువ ధరకు అమ్ముతున్నట్లు విచారణలో నిందితుడు తెలిపాడు. గంజాయితో పాటు ద్విచక్రవాహనాన్ని, మొబైల్ ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ముద్దాయిని కోర్టు ద్వారా రిమాండ్ చేశారు.



గంజాయి విక్రయిస్తూ పట్టుబడ్డ డేవిడ్